నల్లగొండ
సత్యనిష్ఠ
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి
25 ఆదివారం అక్టోబర్ 2026 పేజీలు: 3



## ఔరవాణి చెరువుకు నీళ్లు తెచ్చిన వారికి అభినందనలు



నార్కట్పల్లి-అక్టోబర్ 24( సత్యనిష్ఠ): ఔరవాణి గ్రామ ప్రజలకు నమస్కారం. మన ఊరి చెరువులోకి నీళ్లు రావడం సంతోషకరమైన విషయం.నీళ్లు తెచ్చే కార్యక్రమంలో సొంత నిధులతో కృషి చేసిన ఉప సర్పంచ్ శివరాత్రి వెంకటేష్ కు, తన భూమి నుండి అనుమతి ఇచ్చిన నీరుడు నరసింహారెడ్డికి, సహకరించిన చందురయాపిట్ల పెళ్లి యాదవ్ కు కృతజ్ఞతలు. గతంలో రెండు నెలలు కష్టపడి ఇరిగేషన్ డిపార్ట్మెంట్, రోడ్డు కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సహకారంతో పత్రి కుంటను నింపి పెద్ద చెరువుకు నీళ్లు తీసుకువచ్చానని, అయితే కొందరు అడ్డుపడటం వల్ల చెరువు అభివృద్ధికి ఆటంకం కలిగిందని తెలిపారు. ఇకనైనా మంచి పనులు చేసే వారికి సహకరించాలని కోరారు. కంటెస్టెంట్ సర్పంచ్- ముప్పిడి మారయ్య, ఔరవాణి.

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ అనుచిత ప్రవర్తన

- మంత్రి శ్రీధర్ బాబుతో బ్రాహ్మణ సంఘాల భేటీ



హైదరాబాద్-అక్టోబర్ 24 (సత్యనిష్ఠ) : బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ అనుచిత ప్రవర్తన పట్ల సమాజంలో వ్యతిరేకత నేపథ్యంలో బ్రాహ్మణ, ఇతర సామాజిక సంఘాలతో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గంటన్నర పాటు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమీక్షలో సామాజిక సమరసత పూర్వ అధ్యక్షులు డా. వంశ తిలక్, జాంబవ సేన అధ్యక్షులు చింత స్వామి మాదిగ, డా. యజ్ఞం పవన్ కుమార్ శర్మ, పోచంపల్లి రమణారావు, రజినీరావు, జ్యోతి కులకర్ణి, ఆవునూరి రమణారావు, నైషధం సత్యనారాయణ మూర్తి, గుడా రాజేశ్వరరావు, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం, గంప రామారావు, వురే ప్రసాద్ రావు, రవికిరణ్, గూడ జయరాం, బాలు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఇటీవల బసవరాజ్ శ్రీనివాస్ చేసిన అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ ఇటువంటి అనాగరిక ప్రవర్తనను సమర్థించనని, పదవిలో ఉన్న వ్యక్తి హుందాగా అందరినీ కలుపుకొని గౌరవప్రదంగా సేవ చేయాలని, బ్రాహ్మణ నాయకత్వం అత్యంత విలువైన, సంస్కారవంతమైన ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. తప్పుడు, జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన బసవరాజ్ శ్రీనివాస్ పై తప్పకుండా చర్యలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం కృషి చేస్తుందని, తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక, తెలంగాణ లీడర్స్ కౌన్సిల్ తదితర సంస్థల ఆధ్వర్యంలో యజ్ఞం పవన్ కుమార్ శర్మ చేపట్టిన ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్రకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఎవరు హద్దు దాటి, అనుచితంగా ప్రవర్తించినా సహించనని, బ్రాహ్మణుల గౌరవ పరిరక్షణకు కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు.

## శివన్నగూడెంలో దారుణం భార్యను కత్తితో నరికి చంపిన భర్త



మర్రిగూడ-సత్యనిష్ఠ:నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామంలో శనివారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త తన భార్యను కత్తితో విచక్షణారహితంగా నరికి హతమార్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివన్నగూడెం గ్రామానికి చెందిన సుంకరి రజిత (38), ఆమె భర్త సుంకరి ఇంద్రయ్య (40)ల మధ్య కొంతకాలంగా కుటుంబ విషయాలై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇద్దరి మధ్య మరోసారి వివాదం తలెత్తడంతో, క్షణికావేశానికి గురైన ఇంద్రయ్య కత్తితో (వేటకొడవలితో) రజితపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో పడిన రజిత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. గ్రామంలో జరిగిన ఈ దారుణాన్ని చూసి స్థానికులు భయాందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మర్రిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు ఇంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.

## హైదరాబాద్‌లో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు ప్రారంభం



హైదరాబాద్- అక్టోబర్ 24 (సత్యనిష్ఠ): ఐజేయూ, మెఫీ, టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టూరిజం ప్లాజా హోటల్ లో రెండు రోజుల మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి మహిళా జర్నలిస్టులు హాజరయ్యారు. నిర్భయంగా ప్రశ్నించే గొంతుకలను అణచివేయలేరు: మంత్రి సీతక్క చేతిలో మైక్ పట్టుకున్న మహిళ శత్రువు కాదని, మహిళల ప్రగతిని బట్టే సమాజ ప్రగతి ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. మహిళా జర్నలిస్టులపై దాడులను ఖండించారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణలో మహిళా జర్నలిస్టుల పాత్ర కీలకం: జస్టిస్ రాధారాణి**

స్వతంత్ర పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ లేదని, డీప్ ఫేక్, ఏఐ కాలంలో ఫ్యాక్ట్ చెకింగ్ అవసరమని, పోష్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని జస్టిస్ రాధారాణి అన్నారు.




**మహిళలు నిర్భయంగా నేతృత్వం వహించాలి: కమిషనర్ సుమతి**

మహిళలు డెస్క్ కే పరిమితం కాకుండా ఫీల్డ్ రిపోర్టింగ్ లో ముందుండాలని మల్కాజిగిరి కమిషనర్ సుమతిఅన్నారు. ఈ సదస్సులో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కర్ణాటక అకాడమీ చైర్పర్సన్ ఆయేషా ఖానమ్, ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ, సెక్రటరీ జనరల్ సోమసుందర్, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడ టిఎస్‌యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




మర్రిగూడ-సత్యనిష్ఠ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టి ఎస్ యు టి ఎఫ్ మర్రిగూడ మండల 13వ మహాసభ నాగవరం శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంజెఆర్ బి.యిడి కాలేజీలో వైభవంగా జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శులు గేర నర్సింహా, కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పిఆర్‌సి అమలు, డిఏల విడుదల, సిపిఎస్ రద్దు మరియు పెండింగ్ బిల్లుల చెల్లింపుకై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ సమస్యలను పరిష్కరించాలని, డిఎస్సీ 2024 ఉపాధ్యాయులకు రెండో ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన కార్యవర్గం (2026-27) మండల అధ్యక్షుడిగా ఇస్లావత్ హనుమంత్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా పున్న కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా బందారు గోవర్ధన్, మహిళా ఉపాధ్యక్షురాలిగా తాతపూడి రత్నకుమారి, కోశాధికారిగా గంటెల అశోక్, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా పోతుగంటి స్వప్న, వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్‌గా ఎం. నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు బందారు గోవర్ధన్, దోరతి, విజయలక్ష్మిలను మరియు పూర్వ అధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, కరీం, రమేష్ బాబు, ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం..
- ఇంచార్జ్ డీఎస్పీ రవి ఆధ్వర్యంలో..



మిర్యాలగూడ,సత్యనిష్ఠ, అక్టోబర్ 24 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇంచార్జ్ డీఎస్పీ రవి ఆధ్వర్యంలో పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు నివాళు లర్పించారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. రక్తదానం ఎంతో విలువైనదని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదాతలు చేస్తున్న సేవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులను, స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డివిజన్ పోలీస్ అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్



హుజూర్ నగర్/గరిడేపల్లి, అక్టోబర్ 24 (సత్యనిష్ఠ): భూముల లావాదేవీల్లో అవకతవకలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కఠిన చర్యలు తీసుకున్నారు. హుజూర్ నగర్ తహసీల్దార్ బి. కవిత, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలనాధికారి ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్ నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు హుజూర్ నగర్ ఆర్డీవో నివేదికలో వెల్లడైంది. ఎన్ఎస్పీ కాలువ భూములు, భూసంస్కరణల చట్టం పరిధిలోని భూముల విషయంలో పాత రికార్డులు, కోర్టు



ఉత్తర్వులను పరిశీలించకుండా తప్పుడు ధ్రువీకరణ నివేదికలు ఇచ్చారని విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో తప్పుడు డిక్లరేషన్లు ఇచ్చిన వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం, అవకతవకలను సహించేది లేదని హెచ్చరించారు.





ముగ్గురు రెవెన్యూ అధికారులు

# భూ బకాసురులపై బీజేపీ అలుపెరగని పోరాట

- అధికారుల సస్పెన్షన్ ప్రజా విజయం: కొండ హరీష్ గౌడ్



సత్య నిష్ఠ ఆర్ సి హుజూర్నగర్: దేవాదాయ, ప్రభుత్వ, సీలింగ్, ఎన్ఎస్పీ కెనాల్ భూముల అన్యాక్రాంతం, అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా భూ కబ్జాదారులకు భూములు కట్టబెట్టి పేద ప్రజలకు అన్యాయం చేసిన వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ అలుపెరగని పోరాటం చేసిందని హుజూర్ నగర్ పట్టణ బీజేపీ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.తమ పార్టీ నిరంతర పోరాటం, ప్రజల పక్షాన నిలబడి చేసిన ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం స్పందించి హుజూర్ నగర్ ఎమ్మార్వో, ఆర్ఐ మరియు జీపీఓ అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పరిణామాన్ని ప్రజా విజయంగా, భారతీయ జనతా పార్టీ కార్యకర్తల విజయంగా భావిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు పేద ప్రజల హక్కులకు సంబంధించిన భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడటమే తమ లక్ష్యం అని తెలిపారు. అధికారుల సస్పెన్షన్‌తోనే ఈ సమస్య పరిష్కారమైనట్లు భావించబోమని, పట్టణ పరిధిలో జరిగిన అన్ని రకాల భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అన్యాయం జరిగిన పేద ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆక్రమణలు మొత్తం కూడా స్థానిక మంత్రివర్యులు మరియు స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపిస్తూ, మళ్లీ ఇలా చేయాలని చూసే అధికార పార్టీ నాయకులను ఖబడ్దార్ అని హెచ్చరించారు. రాబోయే రోజుల్లోను భూ బకాసురుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున భారతీయ జనతా పార్టీ మరింత ఉధృతంగా, అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్ గౌడ్, జిల్లా లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కంటు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గుండా గోపి, రాళ్లబండి రామారావు, మేళ్లచెరువు లక్ష్మణ్, సోమగాని ప్రదీప్, కొప్పెర సాయిరాం, సతీ బల్వంత్ సింగ్, శ్రవణ్, క్రాంతి కుమార్ మరియు తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన శిబిరం

- జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్



మిర్యాలగూడ-అక్టోబర్ 24 (సత్యనిష్ఠ): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాద బాధితులు, శస్త్రచికిత్స రోగులు, ప్రసవ సమయంలో మహిళలకు రక్తం ఎంతో అవసరమని అన్నారు. అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని, వారి స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యువత సామాజిక సేవలో చురుకుగా పాల్గొనాలని, రక్తదానంపై అపోహలు తొలగించాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాలను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శివరామిరెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగరాజు, శ్రీను నాయక్, మంజుల, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్

రామచంద్రపురం సర్పంచ్ సుధీర్



సత్య నిష్ఠ ఆర్ సి హుజూర్నగర్ : రాష్ట్రంలో ఒకవైపు రైతులు కన్నీరు కారుస్తుంటే మరోవైపు నిరుద్యోగులు ఉద్యోగాలకై ఎదురుచూస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వైపు పరుగులు పెడుతున్నారని రామచంద్రపురం సర్పంచ్ బొలిశెట్టి సుధీర్ విమర్శించారు. శనివారం పొనుగోడు లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా జాబ్ క్యాలండర్ కోసం ఎదురుచూస్తున్న యువత నోటిఫికేషన్లు రాక తమ జీవితమే ఆగం అయిపోతుందని బాధ పడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి గాలి మోటార్లో తిరుగుతూ ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో రాజకీయ లబ్ధి కోసం కాకుండా రాష్ట్ర ప్రజల బాగుకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సుపరిపాలన అందించరన్నారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి నియంతృత్వ కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాల న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెళ్ళచెరువు వెంకటరమణ, మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, బిల్లా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ అనంతు కరుణాకర్ గౌడ్, నందిపాటి నరహరి, పంగ నాగయ్య, పొలంపల్లి మహా ఆంజనేయులు,నందిపాటి శ్రవణ్,సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల కుటుంబాలను పరామర్శ..

- **పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుంది**
- **ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**మిర్యాలగూడ,సత్య నిష్ట, అక్టోబర్ 24 :** పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా లో శనివారం 1994 సంవత్సరంలో అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నక్సలైట్ల దాడిలో అమరులైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వారికి



పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పించగలుగుతున్నారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఏ సమస్య ఎదుర్కొన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,నల్గొండ డిఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బీ సీఐ నాగరాజు, 2 టౌన్ సీఐ ఆదిరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, 2 టౌన్ ఎస్. ఐ సైదా బాబు, అమరవీరుడు ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శ

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**సత్య నిష్ఠ,మిర్యాలగూడ,అక్టోబర్ 24'** దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బెట్టె తండాకు చెందిన అజ్మీరా వాల్య పట్టణంలోని లీలా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల



లక్ష్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అజ్మీరా వాల్య మెరుగైన వైద్య సేవలు అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ సత్యనారాయణ స్వామి ఆలయానికి లక్ష విరాళం



**దేవరకొండ-- అక్టోబర్ 24( సత్యనిష్ట):** శ్రీ ఆంజనేయ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధికి దీ=హా పార్టీ నాయకులు నేనావత్ కిషన్ నాయక్ రూ.1,00,000 విరాళం అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించడం అభినందనీయమని, విరాళం అందించిన కిషన్ నాయక్ కు ఆలయ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపినట్లు జల్దా భాస్కర్ తెలిపారు. స్వామి వారి ఆశీస్సులు ఆయన కుటుంబానికి ఉండాలని కోరారు.

## లిఫ్టుల ద్వారా చెరువులను నింపాలి

**బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం మండల కార్యదర్శి**



**కోదాడ - అక్టోబర్ 24 (సత్యనిష్ఠ)** కోదాడ నియోజకవర్గ పరిధిలోని లిఫ్టుల ద్వారా చెరువులను నింపాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ఎస్పి ఏఈకి, స్థానిక తాసిల్దార్ ఎల్ మంగకి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మెమొరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, రైతు సంఘం సూర్యాపేట జిల్లా నాయకుడు బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ ఏలినోవా ప్రభావం వల్ల వర్షపాతం లేక పత్తి, మిరప, వరి పంటలు ఎండిపోయి చెరువులు కుంటలు అడుగంటి పోయినాయి. పశువులకి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఏర్పడినది కావున సంబంధిత అధికారులు వెంటనే లిఫ్టుల ద్వారా చెరువుల నింపాలని, రైతులకు 18 గంటల కరెంటుని ఇవ్వాలని, ఎండి పోయిన వరి, పత్తి పంటలకి నష్ట పరిహారం ఒక ఎకరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. (నడిగూడెం మండలం) స్థానిక ఎన్ఎస్పి మరియు తహసిల్దార్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రైతు సంఘం సీనియర్ నాయకులు ఏనుగుల వీరాంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రేఖ తిరపయ్య, ఎస్.కె లతీఫ్ బాబు, ఎస్.కె సైదా హుస్సేన్, ఎస్కె మస్తాన్, సంపతి పిచ్చయ్య, కాసాని కిషోర్, బొడ్డు వెంకట నారాయణ ,కేసగాని భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు 26న కోదాడలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ రాక

- **ఉపాధి కల్పన, సేవా దృక్పథమే లక్ష్యంగా 'రక్షణ వెల్ఫేర్ సొసైటీ' ఆవిర్భావం**
- **సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్ పోలంపల్లి సుజాత**



**కోదాడ-అక్టోబర్ (సత్యనిష్ట):** కోదాడ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్షణ వెల్ఫేర్ సొసైటీ ఎన్జీవో ప్రారంభోత్సవ కార్యక్రమం 26 సోమవారం నాడు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి కోదాడ పట్టణం లోని వై జంక్షన్ వద్ద ప్రారంభించనున్నట్లు సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్ పోలంపల్లి సుజాత తెలిపారు. రక్షణ వెల్ఫేర్ సొసైటీ ఎన్జీవో ఆధ్వర్యంలో నిరు పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే బృహత్తర లక్ష్యంతో ఈ నూతన ఎన్జీవోను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గం లోని అతిరథ మహారథులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

# మెస్సి మూవీ టీం ఘనంగా సన్మాన కార్యక్రమం..

- **కొర్ర చందు నాయక్‌కు సన్మానం**



**సత్యనిష్ఠ అక్టోబర్ 24:** చందు నాయక్ కార్యాలయంలో మెస్సి మూవీ టీం సభ్యులు మూవీలో ఒక సాంగ్ ని చూపించి మరియు మూవీ సినిమా స్టోరీని వివరించారు. నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా నవంబర్ 13 కు రిలీజ్ కానున్న చందు నాయక్ ను మెస్సి మూవీ టీం సభ్యులు ప్రమోషన్ మరియు సపోర్టు కొరకు వారి కార్యాలయంలో ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించార అనంతరం చందు నాయక్ మాట్లాడుతూ.. మూవీ సినిమా స్టోరీ ని వినడం జరిగింది.పిల్లలు డ్రగ్స్, మత్తు పదార్థాలు, మొబైల్ ఫోన్ లకు బానిసలై చదువు, ఆటలకు దూరమై చెడిపోతున్న ప్రస్తుత పరిస్థితులో చదువుతోపాటు స్పోర్ట్స్ భవిష్యత్తును ఎలా మార్చగలదని ఈ సినిమా తెరకెక్కించిన కథ. దేవరకొండ నియోజకవర్గ కళాకారులు, ప్రజలు మీ పిల్లలకు ఈ సినిమాను చూపించి కొంతైన స్పోర్ట్స్ పై అవగాహన కల్పించే విధంగా చూడాలని ప్రజలను చందు నాయక్ కోరారు. ఈ సినిమాని అందరూ చూసి ఆదరించాల్సిందిగా కోరారు మూవీ టీం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసి ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పిట్ల సిద్దు, అనిల్, నరేష్, మెస్సి మూవీ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు చేయడమే పంచాయతీ కార్మికులు చేసుకున్న పాపమా

- **పనికి తగ్గ ప్రతిఫలం ఏదీ, కార్మికుల సేవలకు గుర్తింపు లేదా**
- **కనీస వేతనం రూ.30 వేలు అమలు చేయాలి: షేక్ సుభాని**



**కోదాడ - అక్టోబర్ 24, (సత్యనిష్ఠ)** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల సేవలకు తగిన గుర్తింపు లభించడం లేదని మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సుభాని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పనులు చేయించుకోవడమే తప్ప, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందించడం లేదని, పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా చాకిరీ చేయించు కోవడమే ప్రభుత్వ విధానమా? అని ప్రశ్నించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 26న నిర్వహించనున్న పంచాయతీ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. శనివారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయం లో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,790 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సుమారు 52 వేల మంది కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా వివిధ సమస్యలను ఎదుర్కొంటు ఉన్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కోరారు. కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఆర్సీలో పంచాయతీ కార్మికులకు గుర్తింపు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాన్ని నెలకు రూ.30 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల పారిశుధ్య నిర్వహణలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 26న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెమట నాగరాజు, కమలాకర్, మధుసూదన్, వెంకన్న, గురవయ్య, వెంకటమ్మ, వీరబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం



**హైదరాబాద్ -అక్టోబర్ 24(సత్య నిష్ఠ):** రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు మనమంతా కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు రక్షణ రంగ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతకు అనుగుణంగా త్వరలోనే "ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0"ను విడుదల చేయబోతున్నట్టు వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో అంతర్భాగంగా హైదరాబాద్ తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి గారు "రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్"ను ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. "రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా చూడాలన్నది నా ఆకాంక్ష. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి స్వావలంబన సాధించడమే కాకుండా రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభిలషించారు. "తెలంగాణ రాష్ట్రం కోసం నాకొక స్పష్టమైన లక్ష్యం ఉంది. ఆ లక్ష్యాన్ని సాధించడంలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఇంకా ఎన్నో విజయాలు సాధించాల్సిన అవసరముంది. దేశ రక్షణ రంగ పరిశ్రమకు అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా తెలంగాణ ఎదగాలి. అందుకు మీ అందరి సహకారం కావాలి" అని కోరారు. "తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని మీరు వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయండి. లక్ష్యాన్ని సాధించడానికి నా నుంచి మీకు ఎలాంటి సహకారం కావాలో చెప్పండి. సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా. అది నా హామీ" అని స్పష్టంగా చెప్పారు. భారతదేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలి. రక్షణ రంగంతో పాటు స్పేస్, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ వంటి అనేక అనుబంధ రంగాల్లో ఈ సమావేశానికి హాజరైన మీరందరూ సహకరించి లక్ష్యాన్ని సాకారం చేయాలని ఆశిస్తున్నా. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గతేడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశ జనాభాలో ప్రస్తుతం తెలంగాణ వాటా 2.5 శాతానికి పైగా ఉంది. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ 5 శాతం వాటాను అందిస్తోంది. 2047 నాటికి ఆ వాటాను 10 శాతానికి పెంచాలన్నది నా లక్ష్యం. ఈ దార్శనికతను సాకారం చేయడంలో రక్షణ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్, వాటి అనుబంధ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకు "రక్షా ఎక్స్‌పో" ఒక ప్రధాన వేదికగా మారుతుంది. ఈ రంగంలో పనిచేస్తున్న వారంతా వినూత్న ఆలోచనలను, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావాలని ఆశిస్తున్నా. అందుకు అవసరమైన సహకారాన్ని, అనువైన వాతావరణాన్ని కల్పిస్తాం అని చెప్పారు. 'భవిష్యత్తులో యుద్ధ స్వరూపం పూర్తిగా భిన్నంగా ఉంటుందని ఈ రంగంలోని నిపుణులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. డ్రోన్లు, రోబోట్లు, కృత్రిమ మేధస్సుతో పనిచేసే వ్యవస్థలు యుద్ధ రంగాన్ని ఎలా మార్చబోతున్నాయో ఊహించండి. మన ముందున్న మార్గం స్పష్టంగా ఉంది. అందుకు సాంకేతిక పరిజ్ఞానమే అత్యంత కీలకం.రక్షణ, స్పేస్, ఏరోస్పేస్, భద్రతా రంగాలకు చెందిన ప్రముఖులు, దిగ్గజ సంస్థలైన డీఆర్‌డీఓ (ఐ=ఐఐా), హెచ్‌ఏఎల్ (నాఐా), బీడీఎల్ (దీఐా), మిధాని, టాటా సంస్థలు, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ఎన్నో ప్రముఖ సంస్థల ప్రతినిధులు మనమధ్యనున్నారు.

## కూరగాయల సాగుతో అధిక లాభాలు

- **కలెక్టర్ తేజస్ లాల్ పవార్**



**సూర్యాపేట-అక్టోబర్ 24(సత్య నిష్ఠ):** కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. నూతనకల్ మం. లింగంపల్లిలో బోయపల్లి సరోజ వంగ, మునగ తోటలను, అలుగునూరులో సాదు రామకృష్ణారెడ్డి ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. పాల్గొన్నవారు: డీఆర్డీవో పీడీ సన్యాసయ్య, జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి వి. ప్రమిత, మండల వ్యవసాయ అధికారి దివ్య, విస్తరణ అధికారులు ముత్యంరాజు, సుధాకర్ రెడ్డి, రాము, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు భద్రాచలం, భవిష్య, తహసీల్దార్ హామీన్ సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు లేకుండా రైతులకు మెరుగైన సరఫరా :ఎమ్మెల్యే బాలు నాయక్



**పీఏ పల్లి-అక్టోబర్ 24(సత్య నిష్ఠ):** పీఏ పల్లి మండలం మేడారం పరిధి రంగారెడ్డి గూడెంలో రూ.2.10 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. అనంతరం మహిళా సమాఖ్య భవనం ప్రారంభించి, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 10 ఏళ్ల కల సాకారమైందని, లో-వోల్టేజీ, అధిక లోడ్ సమస్యలు తొలగి రైతులకు నిరంతర విద్యుత్ అందుతుందని అన్నారు.